ఉల్లి దిగుబడుల్లో వేల్పుల రైతు ఆదర్శం

- ఏడు ఎకరాల్లో ఉల్లి పంట సాగు
- 1000 క్వింటాళ్ల మేర దిగుబడులు
- సాగులో రూ.28 లక్షల ఆదాయం


ఉల్లి గడ్డలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు


తోటలో ఉల్లిగడ్డలను చూపిస్తున్న రైతు

వేముల : ఈ ఏడాది ఉల్లి సాగు దిగుబడులలో వేల్పుల గ్రామానికి చెందిన లింగాల మల్లికార్జునరెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఏడు ఎకరాలలో ఉల్లి సాగు చేశారు. 1000 క్వింటాళ్ల మేర దిగుబడులు అందాయి. కాగా వేల్పుల గ్రామానికి చెందిన రైతు లింగాల మల్లికార్జునరెడ్డి లింగాల మండలంలో ఏఎస్ఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకవైపు ఉద్యోగరీత్యా విధులు, మరోవైపు వ్యవసాయంపై ఆసక్తితో అన్ని రకాల పంటలను సాగు చేస్తుంటారు. వేల్పుల గ్రామంలో ఎక్కువ మంది రైతులు ఉల్లి పంటను సాగు చేస్తారు. ఈ రైతు అరటి సాగు పూర్తి కావడంతో ఉల్లి సాగుపై దృష్టి పెట్టాడు. జూన్ నెలలో ఉల్లి పంటను సాగు చేశాడు.

సకాలంలో సస్యరక్షణ చర్యలు

పంట సాగు చేశాక సస్యరక్షణ చర్యలు ప్రధానంగా చేపట్టారు. ఉద్యాన పంటలలో అతి సున్నితమైన పంట ఉల్లి. పంట కాలం నాలుగు నెలలైనప్పటికి ఈ కాలంలో అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటూ పంటను కాపాడుకున్నాడు. తెగుళ్ల సోకకుండా ముందు జాగ్రత్తలు మందులు పిచికారి చేయడం, సకాలంలో నీటితడులు ఇవ్వడం, రసాయనిక ఎరువులు వాడకం తదితర చర్యలు తీసుకోవడంతో అధిక దిగుబడులు సాధించాడు. నీటి తడులు ఎక్కువ ఇవ్వడం వల్ల కలుపు ఎక్కువగా ఉంటోంది. నీటితడులు ఇచ్చే సమయానికి పంటలో కలుపు తీయాల్సి ఉంటుంది.

1000 క్వింటాళ్లకుపైనే దిగుబడులు

ఉల్లి సాగులో 1000 క్వింటాళ్ల దిగుబడులు సాధించి మండలంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాడు లింగాల మల్లికార్జునరెడ్డి, ఏడు ఎకరాలలో సాగు చేసిన ఉల్లిలో ఎకరాకు 150 క్వింటాళ్ల మేర దిగుబడులు సాధించాడు. పంట సాగు చేశాక వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతోనే అధిక దిగుబడులు సాధించాడు. మండలంలో అక్కడక్కడ కొంతమంది రైతులు 5 నుంచి 7 ఎకరాలలో ఉల్లి సాగు చేసినప్పటికి ఇంతటి దిగుబడులు అందలేదు.

ఎకరాకు లక్ష మేర పెట్టుబడి

ఉల్లి సాగులో ఎకరాకు లక్ష రూపాయల మేర పెట్టుబడి పెట్టారు. 7 ఎకరాలకు రూ.7 లక్షల పెట్టుబడులు అయ్యాయి. పంట సాగు మొదలు దిగుబడులు అందే సమయానికి ఈ పెట్టుబడులు అయ్యాయి. సాగులో కలుపు తీయడం, మందులు పిచికారి చేయడం, సత్తువలు, ఉల్లి గడ్డలు పీకి వేయడం, కోయడం తదితర ఖర్చులతో పెట్టుబడులు అయ్యాయని రైతులు అంటున్నాడు.

సాగులో రూ.28 లక్షల ఆదాయం వచ్చింది



నాకున్న 7 ఎకరాలలో ఉల్లి సాగు చేశా. ఎకరాకు లక్ష రూపాయల చొప్పున పెట్టుబడులు పెట్టాను. మార్కెట్‌లో ఉల్లి ధరలు ఉండటంతో క్వింటా రూ.3500లతో అమ్ముకున్నా. పెట్టుబడులు పోనూ నాకు రూ.28 లక్షల మేర ఆదాయం వచ్చింది.

– లింగాల మల్లికార్జునరెడ్డి(ఉల్లి రైతు), వేల్పుల

19 దరఖాస్తులు

ఎర్రగుంట్ల : దీపావళి పండుగ సందర్భంగా టాపాసుల దుకాణాలకు 19 మంది దరఖాస్తులు చేసుకున్నారని వాటిని విచారణ చేస్తున్నామని తహసీల్దార్ శోభన్‌బాబు తెలిపారు. పట్టణంలో 13 దుకాణాలు, చిలంకూరులో 2, కలమల్లలో 1, పోట్లదుర్తిలో 3 దుకాణాలకు వచ్చాయన్నారు. పట్టణంలో వచ్చిన దుకాణాలను మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేస్తామన్నారు.

రెవెన్యూ గ్రామసభ

లింగాల : హిరోజ్‌పురం గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభకు విశేష స్పందన లభించిందని తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు. సమగ్ర భూ సర్వేలో దొర్లిన పొరపాట్లను సరిదిద్దుకునేందుకు రైతులు భారీగా తరలి వచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ పార్వతి, రెవెన్యూ అధికారులు, వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

వీధిలైట్లకు మరమ్మతులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో ఉన్న వీధిలైట్లకు మరమ్మతు పనులు చేపట్టారు. గత కొంతకాలంగా వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులను నాయకులు మున్సిపల్ కమిషనర్ రాముడు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మున్సిపల్ సిబ్బందిచే వీధిలైట్లకు మరమ్మతు పనులు చేయించారు.

క్లుప్తంగా

అరటి సాగుపై రైతుల ఆసక్తి


సాగులో ఉన్న అరటి పంట

సింహాద్రిపురం : రాయలసీమలోని చీని సాగుకు సింహాద్రిపురం పెట్టింది పేరు. అలాంటిది చీనీకి వస్తున్న తెగుళ్లతో సీనియర్ రైతులు అరటి సాగుపై మక్కువ చూపుతున్నారు. మన ప్రాంతం నుంచి అరటి కాయలు విదేశాలకు ఎగుమతి అవ్వడంతో మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడి టన్ను ధర రూ.20వేలకు పైబడి ఉండటంవలన రైతులు అరటి సాగువైపు మొగ్గు చూపుతున్నారు. 15 ఏళ్ల పైబడిన తెగుళ్ల ఆశించిన చీనీ తోటలను తొలగించి అరటి పంటను పండిస్తున్నారు. అరటిలో ధరలు స్థిరంగా ఉండి, అధిక దిగుబడిని ఇస్తూ, తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయమివ్వడం వలన మండలంలో అరటి సాగు విస్తీర్ణం గత సంవత్సరం కంటే 1200 ఎకరాల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

ఇంటింటా లార్వా సర్వే


నీటి తొట్టిలో అబైట్‌ను పిచికారి చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

తొండూరు : హెల్త్ ఎడ్యుకేటర్ విజయమ్మ, సీహెచ్ఓ పుల్లమ్మల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటా లార్వా సర్వేని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇళ్లలో నిల్వ ఉన్న నీటిలో దోమల ఉత్పత్తిని నివారించేందుకు అబైట్‌తోపాటు ఆయిల్స్ బాల్స్‌ను వేశారు. ఈ సందర్భంగా వారు చికెన్ గున్యా, డెంగీ వ్యాధుల నివారణ కోసం రక్త నమూనాలను సేకరించారు. జ్వరాలు, తలనొప్పి, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుల సలహాలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నిర్ణీత కాలంలో పూర్తిచేయాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ విద్యాశాఖాధికారి

ముద్దనూరు : విద్యార్థుల సమగ్ర వివరాలు పొందుపరిచే అపార్ కార్డు ప్రక్రియను ఈనెలాఖరుకు పూర్తిచేయాలని డిప్యూటీ విద్యాశాఖాధికారి కృష్ణప్ప ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నతపాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లడుతూ 9, 10వ తరగతి విద్యార్థులకు అందివాల్సిన అపార్ కార్డులో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన పదవ తరగతి విద్యార్థుల జరుగుతున్న విద్యా బోధనపై ఆరా తీసి, వారి నోట్ పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు సుబ్బారావు, నాగేశ్వరరావు నాయక్, ప్రధానోపాధ్యాయుడు ఆవుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

రశీదులు పొందాలి


రైతులకు రశీదులను అందజేసిన మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు

వీరపునాయునిపల్లె : 2024 ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటల వివరాలకు సంబంధించిన రశీదులను ప్రతి రైతు పొందాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. బుధవారం మండలంలోని అనిమెల రైతు సేవాకేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. మండల వ్యాప్తంగా 15 రైతు సేవా కేంద్రాల పరిధిలో 4487 మంది రైతులు 16446 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారన్నారు. సాగుచేసిన ప్రతి పంటను 100 శాతం ఇ క్రాప్ చేయడంతో పాటు 99.84 శాతం ఈకేవైసి చేయించామన్నారు. పంటలు సాగు చేసిన రైతులకు ఎంత విస్తీర్ణంలో సాగు చేశాడన్న దానికి సంబంధించి వివరాలతో కూడిన రశీదును గ్రామ వ్యసాయ సహాయకులు అందజేస్తారన్నారు. పంట సాగు చేసిన ప్రతి రైతు రైతు సేవా కేంద్రానికి వెళ్లి రశీదులను పొందాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మానవహక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం

జమ్మలమడుగు : మానవ హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యమని ప్రపంచ మానవ హక్కుల జాతీయ చైర్మన్ కోనయ్య తెలిపారు. బుధవారం పట్టణంలోని అవధూతేంద్రస్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన మానవహక్కులపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మానవ హక్కుల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జమ్మలమడుగు డివిజన్ చైర్మన్‌గా షెక్షావలిని ఎంపిక చేశారు.

అధ్వానంగా వీధిలైట్ల నిర్వహణ


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : పట్టణంలో వీధిలైట్ల నిర్వహణ కూటమి ప్రభుత్వంలోనే అధ్వానంగా ఉందని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పులివెందుల మున్సిపాలిటీకి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఏమి తెలుసుకోకుండా మున్సిపాలిటీలో వీధిలైట్ల వెలగకపోవడానికి పాలక వర్గమే కారణమంటూ లైట్లు వెలగకపోతే ఆందోళనలు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2015లోనే టీడీపీ ప్రభుత్వం ఈఈఎస్ఎల్ కంపెనీతో లోపాయికారి ఒప్పందం చేసుకుని రాష్ట్ర వ్యాప్తంగా వీధిలైట్ల బాధ్యత అప్పగించిందన్నారు. ఈఈఎస్ఎల్ కంపెనీతో ఎంత లాలూచీ పడ్డారో బయట పెట్టాలన్నారు. గతం, ప్రస్తుత మంత్రి నారాయణతో ఎంత లాలూచీ పడ్డారో బయటపెట్టాలన్నారు. పులివెందుల మున్సిపాలిటీలో 3600 వీధిలైట్ల నిర్వహణ చేయాలి కానీ ఒక్కరోజు కూడా వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వీధిలైట్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో రూ.35 లక్షల పెనాల్టీ కూడా వేశామన్నారు. ఆరుగురు వర్కర్లు ఉండి ఆ నిర్వహణ చూడాలి.. ఆ బాధ్యత మేమంతా తీసుకుని నిర్వహణ చేశామన్నారు. ఇవన్ని తెలుసుకుని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. ఈఈఎస్ఎల్ జగన్ ప్రభుత్వం పనితీరు, కూటమి ప్రభుత్వం పనితీరు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందన్నారు. మీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వకుంటే కాంట్రాక్టర్లు ఎలా పనులు చేస్తారన్నారు. మీ నిర్వాహకంవల్ల రాష్ట్రం అధ్వాన పరిస్థితిలో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పులివెందులపై కక్ష కట్టి 94 రకాల పనులను రద్దు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీగా ఉండి సమీక్ష నిర్వహించి పులివెందుల మున్సిపాలిటీలో ఎంతమేర పనులు పెండింగ్‌లో ఉన్నాయి, వాటికి ఎంతమేర అవసరం పడుతుందో తెలుసుకుని మీ ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్‌లతో మీకు దమ్ము ధైర్యం ఉంటే నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. వెంకటేశ్వరస్వామి సాక్షిగా ఆరోజు పులివెందులలో పాడాను కొనసాగిస్తామని మాట ఇచ్చారని, మీరు మాట తప్పారని అందుకు మీరు ఎమ్మెల్సీగా కొనసాగే అర్హత లేదన్నారు. మెడికల్ కళాశాలను ఫస్టియర్ కావాల్సిన సామగ్రి ఉండటంతోనే ప్రారంభించడం జరిగిందని.. ఇంకా అవసరం ఏవైనా ఉంటే కావాలని ప్రభుత్వాన్ని అడగాలని, అలా కాకుండా విమర్శలు చేయడం సరికాదన్నారు. ఈ ప్రాంత వాసిగా ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి బాధ్యత లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, మున్సిపల్ కౌన్సిలర్ ఖాదర్ బాష, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లోపక్కులు సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం(శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ళు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టి.బి. మచ్చలు, కుష్టు, తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణ బేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నైతిక విలువలతో అవినీతి రహిత సమాజ అభివృద్ధి


విజేతలైన విద్యార్థులతో పవర్‌గ్రిడ్ అధికారులు

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని చింతకొమ్మదిన్నె మండలం పెద్దకాంపల్లిలోని పవర్ గ్రిడ్ సంస్థ వారు జె.కొత్తపల్లె ప్రభుత్వ హైస్కూల్, బోడెద్దులపల్లి ఉర్దూ హైస్కూల్‌లలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పవర్ గ్రిడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ హరివెంకటకుమార్ మాట్లాడుతూ భవిష్యత్తు సమాజం ఉత్తమంగా రూపొందాలంటే విద్యార్థులు బాగా చదివి అభివద్ధిలోకి రావాలన్నారు. ఉన్నత సమాజ రూపకల్పనలో విద్యాలయాల పాత్ర ప్రముఖమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పవర్ గ్రిడ్ అధికారులు, బాలబాలికలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు


మాట్లాడుతున్న ఏఓ చెన్నారెడ్డి

వేముల : శనగ పంటలో నూతన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పెద్దజూటూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చెన్నారెడ్డి మాట్లాడుతూ శనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొంది ఆదాయం పొందవచ్చునన్నారు. అనంతరం గ్రామ రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న శనగ విత్తనాల పంపిణీని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి


ఎర్రగుడిపాడులో పొలం పిలుస్తోందిలో మాట్లాడుతున్న ఏఓ సరస్వతి

కమలాపురం : రైతులు తాము సాగు చేస్తున్న సాగు విధానాల్లో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం మండలంలోని ఎర్రగుడిపాడు, పందిళ్లపల్లె గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులకు పంటల సాగు, సాగులో పాటించాల్సిన మెలకువళలపై అవగాహన కల్పించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక ఆదాయం గడించాలన్నారు. రానున్న కాలంలో తక్కువ పెట్టుబడితో అధిక నాణ్యమైన దిగుబడులు, ఆరోగ్యకరమైన పంటలు పండించడానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు దోహదపడతాయన్నారు. కషాయాలు, జీవామృతం తయారు చేయు విధానాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


కంది పంటను పరిశీలిస్తున్న ఏడీఏ ప్రభాకరరెడ్డి

చక్రాయపేట : రైతులు అలవాటు పడితే రానున్న కాలంలో ప్రకృతి వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని పులివెందుల వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ప్రభాకరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కె.ఎర్రగుడి గ్రామం బీఎన్ తాండాలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంతో ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. రైతులకు పలు సలహాలు సూచనలను అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నవంత్‌బాబు, వ్యవసాయ విస్తరణాధికారి రమణారెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం ఓబుల్‌రెడ్డి

కమలాపురం : మండల పరిధిలోని పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఇమ్రాన్, జాహ్నవిలు ఈనెల 21వ తేదీన కడప నగరంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచారు. వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అలాగే 8వ తరగతికి చెందిన ఆరిఫ్ అనే విద్యార్థి మొదటి స్టాండ్ బాయ్‌గా నిలిచాడు. వారిని బుధవారం పాఠశాల హెచ్‌ఎం ఓబుల్‌రెడ్డి, పీడీఎల్‌ఏ సునీల్‌లు అభినందించారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.16.14 కోట్ల ఉపాధి నిధులు మంజూరు

మైలవరం : జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలో ఆరు మండలాలకు సంబంధించిన రూ.16.14 కోట్లు ఉపాధి నిధులు వివిధ రకాల పనులకు మంజూరయ్యాయి. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, గ్రావెల్ రోడ్లు, ప్రహరీగోడ నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు డీఈ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో ఈ పనులను చేపట్టడానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మండలాల వారిగా జమ్మలమడుగుకు 16 పనులకు గాను రెండు విడతలుగా రూ.3.5కోటు, మైలవరం 21 పనులకు రూ.4.3 కోటు, పెద్దముడియం 27 పనులకు రూ.1.83 కోట్లు, కొండాపురం 19 పనులకు రూ.1.61 కోట్లు, ముద్దనూరు 22 పనులకు రూ.1.83 కోట్లు, ఎర్రగుంట్ల 11 పనులకు రూ.2.8 కోట్లు మంజూరు కాగా మరో ఆరు బీటీ రోడ్లకు సంబంధించి రూ.5.61 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

ఇన్‌చార్జి ఎస్ఐగా ఎస్ఎండీ షరీఫ్

సింహాద్రిపురం : మండల ఇన్‌చార్జి ఎస్ఐగా షేక్ మహమ్మద్ షరీఫ్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ తులసీ నాగప్రసాద్ సెలవుపై వెళ్లడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఎస్ఐగా ఎస్ఎండీ షరీఫ్ బాధ్యతలు చేపట్టారు.

జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం మహాసభలు

జమ్మలమడుగు : కడప జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సీపీఎం జిల్లా మహాసభలను ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మనోహర్ తెలిపారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, కడప జిల్లా అభివృద్ధి సాగునీటి ప్రాజెక్టులపై చర్చించడం కోసం డిశంబర్ 14, 15వ తేదీల్లో మహాసభలను కడపలో నిర్వహిస్తున్నామన్నారు.

ఎల్ఈడీ టీవీ చోరీ

పులివెందుల రూల్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె రోడ్డులో ఉన్న ఓ ఇంటిలో బుధవారం ఉదయం దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి కథనం మేరకు.. దుండగులు ఇంట్లోకి చొరబడి ఎల్ఈడీ టీవీని దోచుకెళ్లారని, ఎవరూ గుర్తు పట్టకుండా సీసీ కెమెరా బాక్స్‌ను కూడా ఎత్తుకెళ్లారన్నారు. నిర్మానుష్య ప్రాంతంలో ఒకటే ఇల్లు ఉండటంతో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. ఇంట్లో నగదు, బంగారు ఆభరణాలు లేకపోవడంతో ఎల్ఈడీ టీవీని ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు తెలిపారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

వేంపల్లె : జాతీయస్థాయి ఖోఖో పోటీలకు వేంపల్లె శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. బుధవారం చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లెలోని ఎస్వీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలకు తమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి పి.ధర్మ ప్రభాకర్‌రెడ్డి ఎంపిక య్యారన్నారు. పీఈటీ కృష్ణ ప్రసాద్‌ను ఆయన ప్రశంసించారు.

తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు


పెండ్లిమర్రి : రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగుచేస్తే తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. పెండ్లిమర్రి మండలంలోని కోనాయపల్లె గ్రామ పొలాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రైతులతో మాట్లాడారు. ముందుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన మినుము పంటను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. అనంతరం రైతులు తయారు చేసిన నీమాస్త్రంను పరిశీలించి వాటి వల్లన కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ ఓబులేసు, ఏఈఓ గంగాధర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్ గంగిరెడ్డి, వీఏఏ చిట్టి, రైతులు పాల్గొన్నారు.

పెన్నానదిలోకి భారీగా వరద నీరు


పెన్నానదిలో ప్రవహిస్తున్న నీరు

జమ్మలమడుగు : పెన్నానదిలోకి భారీగా వరద నీరు చేరుతోంది. మైలవరం జలాశయం నుంచి 5 గేట్ల ద్వారా ఇరిగేషన్ అధికారులు పదివేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు ఈఈ రమేష్ తెలిపారు. గండికోట ప్రాజెక్టు నుంచి పదివేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో వచ్చిన నీటిని దిగువకు నేరుగా వదిలేస్తున్నారు. సత్యసాయి జిల్లా, అనంతపురం జిల్లాలో భారీ వర్షాలు పడటంతో చిత్రావతి, పెన్నానదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. దీంతో మరింతగా మైలవరం జలాశయంలోని నీటిని పెన్నానదిలోనికి విడుదల చేస్తామన్నారు. ఇప్పటికే మైలవరం జలాశయంలో దాదాపు ఆరు టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి వస్తున్న నీటిని పూర్తిగా దిగువకు వదిలేస్తామని పరివాహక ప్రాంతాల ప్రజలు పెన్నానదిలోకి వెళ్లకూడదని ఆయన సూచించారు.

అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో వైస్ చాన్సలర్ విజయ్‌కుమార్, అధికారులు

వేంపల్లె : అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపికై నట్లు డైరెక్టర్ ఏఏఎస్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీన నూజివీడు ట్రిబుల్ ఐటీ క్యాంపస్‌లో ఆర్జీయూకేటీ అంతర్ విశ్వ విద్యాలయాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలలో 7 మంది విద్యార్థులు, 9మంది విద్యార్థినులు అత్యంత ప్రతిభను కనబరిచి ఆలిండియా సౌత్ జోన్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు వివిధ విశ్వవిద్యాలయాలలో నిర్వహించే పోటీలకు ఆర్జీయూకేటీ యూనివర్సిటీ తరపున పాల్గొననున్నారని తెలిపారు. నవంబర్ 1 నుంచి 5 వరకు బెంగళూరులోని చిర్స్ యూనివర్సిటీలో జరిగే బాస్కెట్ బాల్, ఈనెల 26వ తేదీ నుండి 29వ తేదీ వరకు చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే బ్యాట్మింటన్, ఈనెల 30వ తేదీ నుండి నవంబర్ 3వ తేదీ వరకు చెన్నై ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీలో జరిగే కబడ్డీ పోటీలలో పాల్గొనున్నారని తెలిపారు. ఆర్‌కే వ్యాలీ క్యాంపస్ విద్యార్థులు ఎంపిక కావడంపట్ల వైస్ చాన్సలర్ విజయ్ కుమార్‌తోపాటు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రవి కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు పి.వి రమణా రెడ్డి, వి.బాల ఓబయ్య, శంషాద్ బేగంలు హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు.

సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు


మాట్లాడుతున్న తహసీల్దార్ శోభన్‌బాబు

ఎర్రగుంట్ల : రైతుల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తుందని తహసీల్దార్ శోభన్‌బాబు తెలిపారు. బుధవారం చిన్నదండ్లూరు, ఇల్లూరు, గోపులాపురం గ్రామాలలో రెవెన్యూ గ్రామ సభలను ఆయన నిర్వహించి మాట్లాడారు. రైతులందరు వారి సమస్యలను ఈ సభల ద్వారా అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, రైతులు, సచివాలయ సిబ్బంది , వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి


అధికారులతో చర్చిస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

ముద్దనూరు : ప్రజల ఫిర్యాదులు వారి సమస్యలపై దృష్టి పెట్టి వాటిని సకాలంలో పరిష్కరించాలని ఆర్డీఓ సాయిశ్రీ అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని తొలిసారి ఆమె బుధవారం సందర్శించి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. జనన, మరణ, కుటంబ సభ్యుల ధృవీకరణపత్రాలు మంజూరు చేయడంలో జాగ్రత్త వహించి సంబంధిత శాఖాధికారుల వివరణ తీసుకోవాలని తహసీల్దారు వరదకిషోర్‌రెడ్డిని ఆదేశించారు. ఇతర సమస్యలపై సిబ్బందితో ఆమె చర్చించారు.